క్లుప్తంగా

గుంతలు పూడ్చివేత



సాక్షి ఎఫెక్ట్..

నస్రుల్లాబాద్‌: రోడ్డుపై ఏర్పడ్డ గుంతను పంచాయతీ సిబ్బంది పూడ్చి వేశారు. సాక్షి దినపత్రికలో శుక్రవారం 'రోడ్డు మధ్యలో గుంత.. తీరని చింత' శీర్షికన ప్రచురితమైన వార్తకు పంచాయతీ సిబ్బంది స్పందించి గుంతలో కాంక్రీట్‌ పొడి వేసి పూడ్చి వేశారు.

జోరందుకున్న నాట్లు



మద్నూర్‌: మద్నూర్‌, డోంగ్లీ మండలాల్లోని కుర్లా, సిర్‌పూర్‌, మదన్‌హిప్పర్గా, సుల్తాన్‌పేట్‌ తదితర గ్రామాల్లో వరి నాట్లు జోరందుకున్నాయి. వర్షాలు ప్రారంభం కావడంతో రైతులు వరి నాట్ల పనుల్లో బీజీబీజీ అయ్యారు. కొందరు రైతులు ఇప్పటికే నారుపోయగా, మరికొందరు నారు కోసం మడులు సిద్ధం చేస్తున్నారు.

మిషన్‌ భగీరథ నీటి కోసం ఆందోళన

తాడ్వాయి: మండలంలోని ఎర్రాపహాడ్‌ గ్రామానికి మిషన్‌ భగీరథ నీరు సరఫరా కావడం లేదని సర్పంచ్‌ బొక్కానర్సారెడ్డి ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యు లు బుధవారం రాత్రి గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. వారం రోజులుగా నీరు సరఫరా చేయకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పే ర్కొన్నా రు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని వారు ఆరోపించారు. ధర్నా అనంతరం మిషన్‌ బగీరథ ద్వారా నీటిని సరఫరా చేశారని గ్రామస్తులు తెలిపారు.

భట్రాజుల సమస్యల పరిష్కారానికి కృషి



నిజాంసాగర్‌: భట్రాజుల సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలిగా భట్టు సునీతను ఎంపిక చేసినట్లు జిల్లా ప్రచార కార్యదర్శి భట్టు ప్రసాద్‌ రాజ్‌ తెలిపారు. భట్రాజుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని సునీత వెల్లడించారు.

కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

నాగిరెడ్డిపేట: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీడీ కార్మికులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు వెంకట్‌గౌడ్‌, చంద్రశేఖర్‌, మోతీరాం నాయక్‌ డిమాండ్‌ చేశారు. నాగిరెడ్డిపేటలో గతంలో డబుల్‌ బెడ్రూం ఇళ్ల కోసం కేటాయించిన స్థలంలో బీడి కార్మికులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే నాగిరెడ్డిపేటలో డబుల్‌ బెడ్రూం ఇళ్ల కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమించి అక్కడే గుడిసెలు వేస్తామన్నారు. బీడి కార్మిక సంఘం నాయకులు లావణ్య, నస్రీన్‌, లక్ష్మి, నాగమణి, లత పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

బాన్సువాడ రూరల్‌: మండలంలోని చిన్న రాంపూర్‌ తండాలో శుక్రవారం పోడు భూములకు పట్టాలు పొందిన గిరిజన రైతులు సీఎం కేసీఆర్‌, స్పీకర్‌ పోచారం శ్రీనివాస్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎన్నో ఏళ్లుగా పట్టాల కోసం ఎదురు చూస్తున్న తమకు న్యాయం జరిగిందన్నారు. సర్పంచ్‌ లలిత, వైస్‌ ఎంపీపీ హరిసింగ్‌ రైతులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



రామారెడ్డి: ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కాంగ్రెస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, రెడ్డిపేట మాజీ సర్పంచ్‌ నర్సాగౌడ్‌ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని రెడ్డిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు సౌండ్‌ సిస్టం వితరణ చేశారు. అదేవిధంగా ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం, జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించే పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ఇస్తానని ఆయన ప్రకటించారు. అనంతరం నర్సాగౌడ్‌ను ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు, టీచర్లు సన్మానించారు.

'మన బడి'.. భూమి పూజతో సరి!

- గత ఏడాది డిసెంబర్‌లో పనులు ప్రారంభించిన ప్రభుత్వ విప్‌ గంప గోవర్ధన్‌
- నేటికీ ప్రారంభం కాని పాఠశాల భవన నిర్మాణ పనులు
- నాలుగు గదుల్లోనే ప్రస్తుతం బోధన



శిథిలావస్థలో ఉన్న బీబీపేట జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల



బాలికల ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ప్రభుత్వ విప్‌ గంప గోవర్ధన్‌ (ఫైల్‌)

బీబీపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన ఊరు – మన బడి' పథకం కింద చేపట్టనున్న పనులు నత్తనడకన సాగుతున్నాయి. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో అమలు చేస్తున్న మన ఊరు మన బడి పనుల్లో జాప్యం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అవసరమైన గదులు లేకపోవడంతో ఆరుబయటే చదువుకోవాల్సి వస్తోంది. బీబీపేటలోని జిల్లా పరిషత్‌ బాలికల ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో కొన్ని గదులను కూల్చేసి అక్కడ మన ఊరు మన బడి పథకం కింద కొత్త భవనాలు నిర్మించేందుకు గతేడాది డిసెంబర్‌ 17న ప్రభుత్వ విప్‌ గంప గోవర్ధన్‌ భూమిపూజ చేశారు. వీటి కోసం ప్రభుత్వం రూ. 1.30 కోట్లు మంజూరు చేసింది. పనుల ప్రారంభానికి శంకుస్థాపన చేసి ఆరు నెలలు గడిచినా పనుల్లో ఎలాంటి పురోగతి కన్పించడం లేదు.

ప్రస్తుతం ఉన్న నాలుగు గదుల్లోనే ఆరు తరగతులను నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు ఒక్కొక్కటి, పదో తరగతిలో రెండు సెక్షన్లు ఉన్నాయి. నాలుగు గదుల్లో కూడా ఒకటి వర్షపు నీరు లీకేజీ అవుతుండగా మరో గదిలో పైకప్పు పెచ్చులూడుతున్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా గదుల నిర్మాణం కోసం శిథిలావస్థకు చేరుకున్న గదులను తొలగించి చదువు చేయడంతో పనులు ప్రారంభించక పోవడంతో అక్కడ పిచ్చి మొక్కలు పెరిగి పాములకు నిలయంగా మారిందని విద్యార్థులు వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని గదుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మారిన గ్రామాల రూపు రేఖలు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్‌ గంపగోవర్ధన్‌

మాచారెడ్డి: దేశంలోనే ఎక్కడా లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టడం కారణంగా గ్రామాల రూపు రేఖలు మారిపోయాయని ప్రభుత్వ విప్‌ గంప గోవర్ధన్‌ అన్నారు. మండలంలోని రత్నగిరిపల్లి గ్రామంలో శుక్రవారం 1.83 కోట్లతో చేపట్టిన పలు కుల సంఘాల భవన నిర్మాణాలు, పల్లె ప్రకృతి వనం, వైకుంఠ ధామం, సీసీ, బీటీ రోడ్లు, మినీ ట్యాంక్‌ బండ్‌, తాగు నీటి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించుకుని 9 ఏళ్లు పూర్తయింది. గతంలో గ్రామాల్లో ఎన్నడూ జరగని అభివృద్ధి ఇప్పుడు జరిగిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కామారెడ్డి జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసి కొత్తగా కలెక్టర్‌, ఎస్పీ కార్యాలయాలు, మెడికల్‌ కళాశాలలు నిర్మించుకున్నామని పేర్కొన్నారు. మున్ముందు మరిన్ని నిధులు తీసుకువచ్చి గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ శ్రీశైలం, ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు, జెడ్పీటీసీమినుకూరి రామ్‌ రెడ్డి, వైస్‌ ఎంపీపీ నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు బుక్య నర్సిములు, నాయకులు శ్రీకాంత్‌ రెడ్డి, గోవింద రెడ్డి, గ్యార సాయులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సురేందర్‌

గాంధారి: రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యత పాటించి, సకాలంలో పూర్తి చేయాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన గాంధారి–బాన్సువాడ రోడ్డు విస్తరణ పనులను బుగ్గగండి ప్రాంతంలో పరిశీలించారు. ఆయన వెంట ఎంపీపీ రాధా బలరామ్‌ నాయక్‌, జెడ్పీటీసీ శంకర్‌ నాయక్‌, మాజీ జెడ్పీటీసీ తానాజీరావు, సింగిల్‌ విండో చైర్మన్‌ సాయికుమార్‌, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు వజీర్‌ శివాజీరావు, సర్పంచ్‌ సంజీవు, నాయకులు ముకుంద్‌రావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాల పంపిణీ



లబ్ధిదారులతో ఎమ్మెల్యే జాజాల సురేందర్‌

లింగంపేట: గిరిజనుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్‌ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ వెల్లడించారు. శుక్రవారం ఆయన మండలంలోని మాలోత్‌ సంగ్యానాయక్‌ తండాలో ఏర్పాటు చేసిన సమావేశంలో 130 మంది లబ్ధిదారులకు పోడు భూముల పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనులకు 6 శాతం ఉన్న రిజర్వేషన్లు 10 శాతానికి పెంచింది కేసీఆర్‌ ప్రభుత్వం అన్నారు. 70 ఏళ్లుగా పోడు భూముల్లో పంటలు సాగు చేస్తున్న వారికి ప్రతి ఏటా అటవీ శాఖ అధికారుల వేధింపులు, కేసులు నమోదు చేసే వారన్నారు. అలాంటి బాధలు లేకుండా పోడు భూములకు పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మాలోత్‌ సంగ్యా నాయక్‌ తండాకు చెందిన 130 మందికి పట్టాలు పంపిణీ చేశారు. గిరిజనుల ఆర్థిక పరిస్థితి మారడానికి సీఎం కృషి చేస్తున్నారన్నారు. అన్ని రంగాల్లో ఎదగాలంటే ప్రతి గిరిజన బిడ్డ చదువుకోవాలన్నారు. ఎంపీపీ గరీబున్నిసాబేగం, జెడ్పీటీసీ శ్రీల త, సర్పంచ్‌ బన్నిసక్క, ఆర్డీవో శ్రీనివాస్‌నాయక్‌, ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, తహసీల్దార్‌ చంద్రం రాజేశ్వర్‌, ఎంపీటీసీ సామ్మి, విఠల్‌, రైతు సమన్వయ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, వైస్‌ ఎంపీపీ విఠల్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, నరహరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



షబ్బీర్‌ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన శ్రీ సిద్ధరామేశ్వర నగర్‌ గ్రామస్తులు

భిక్కనూరు: మండలంలోని శ్రీసిద్ధరామేశ్వరనగర్‌ గ్రామానికి చెందిన పలువురు మాజీ మంత్రి షబ్బీర్‌ అలీ సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యాక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్‌, మండల అధ్యక్షుడు బీంరెడ్డి, నాయకులు సురేశ్‌, రాజు, శ్రీనివాస్‌, రమేశ్‌ పాల్గొన్నారు.



షబ్బీర్‌అలీతో దోమకొండ మండల ముదిరాజ్‌ సంఘం ప్రతినిధులు

ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్‌కు కృషి

దోమకొండ: అధికారంలోకి వస్తే ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్‌ ఏర్పాటు చేస్తామని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ హామీ ఇచ్చారు. శుక్రవారం దోమకొండకు చెందిన ముదిరాజ్‌ సంఘం సభ్యులు ఆయన్ను కలిసి బీసీ–డి నుంచి బీసీ–ఏ గ్రూప్‌లోకి మార్చాలని కోరారు. కాంగ్రెస్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, ముదిరాజ్‌ సంఘం నాయకులు సీతారం మధు, పిల్లి మల్లేషం, కాకర్ల శేఖర్‌, కొలబొయిన రమేష్‌, నాగారపు రాములు, సీతారం ప్రసాద్‌, నాగారపు లింగం పాల్గొన్నారు.

ఉచితంగా విత్తనాల పంపిణీ



రైతులకు ఉచితంగా మినుములు, పెసర, కందులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

దోమకొండ: మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ప్రభుత్వం సరఫరా చేసిన మినుములు, పెసర్లు, కందులను రైతులకు జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్‌, రైతుబంధు మండల అధ్యక్షుడు తాటిపల్లి తిరుపతిరెడ్డి పంపిణీ చేశారు. విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి పవన్‌కుమార్‌, సింగిల్‌విండో చైర్మన్‌ పన్యాల నాగరాజ్‌రెడ్డి, ఏఈవో కృష్ణరెడ్డి, శ్రీలత, మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ పోశయ్య, బీఆర్‌ఎస్‌ నాయకులు సాయిరెడ్డి, రాజిరెడ్డి, దుర్గారెడ్డి, కూరచంద్రం, సత్యం, సాయి, అంజయ్య, మధుసూధన్‌రెడ్డి, నక్కరవి పాల్గొన్నారు.

కులసంఘ భవనాల నిర్మాణానికి కృషి



మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

దోమకొండ: పార్టీలకు అతీతంగా గ్రామాల్లో కుల సంఘ భవన నిర్మాణాలకు తన సొంత నిధులు ఖర్చు చేస్తున్నట్లు అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం దోమకొండలో మున్నూరుకాపు సంఘం భవన నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కుల సంఘాల భవన నిర్మాణాలకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు బాలయ్య, చంద్రం, నర్సింలు, రాజు, నాగరాజు, స్వామి, శంకర్‌, నర్సింలు, బీజేపీ మండల అధ్యక్షుడు చింతల రాజేష్‌, నాయకులు రవీందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జగదీష్‌ పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



దేవాడా గ్రామంలో కేంద్ర పథకాల గురించి వివరిస్తున్న బీజేపీ నాయకులు



లింగంపల్లి గ్రామంలో..



సోమర్యాగడి తండాలో..

బిచ్కుంద: దేశంలో, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఉంటే మరింత అభివృద్ధి సాధ్యం అవుతుందని బీజేపీ నాయకురాలు లలిత అన్నారు. శుక్రవారం పెద్ద దేవాడా, చిన్న దేవాడా, సిర్‌ సముందర్‌ గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. 9 ఏళ్ల పాలనలో బీజేపీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, మహిళలకోసం చేపట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కిష్టారెడ్డి, పత్తి రమేష్‌, మధు దేశాయి తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్‌: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని కేరళకు చెందిన విస్తారక్‌ సుమతి తెలిపారు. శుక్రవారం మండలంలోని లింగంపల్లి గ్రామంలో కేరళ నుండి వచ్చిన విస్తారక్‌ సుమతి అధ్వర్యంలో ఇంటింట ప్రచారం నిర్వహించి ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అంజని, రమగౌడ్‌, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిరూరల్‌: కేంద్రం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను బీజేపీ నాయకులు మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింట ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎస్‌ఎన్‌రెడ్డి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి రూరల్‌: ప్రతి కార్యకర్త బూత్‌ స్థాయిలో సైనికుల్లా పనిచేయాలని చెన్నైకి చెందిన బీజేపీ నాయకురాలు కలై శెల్వి సూచించారు. మండలంలోని గూడెం గ్రామంలో ఇంటింట వెళ్లి కేంద్రం అమలు చేస్తున్న పథకాలను తెలియజేశారు.

లింగంపేట: బూత్‌ కమిటీలను పటిష్టం చేసి, కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాని తమిళనాడు జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్‌ రంగరాజన్‌ సూచించారు. ఆయన లింగంపేట మండలం భవానిపేట, లింగంపేట గ్రామాల్లో ఇంటింట ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దత్తురాం, బొల్లారం సాయన్న, రాంచందర్‌, వంశీ, నవీన్‌కుమార్‌, అనిల్‌, శుభాష్‌, మోతీరాం, సంతోష్‌, మధుసూధన్‌, నర్సింలు, నారాయణ, బాలయ్య, గణేష్‌, ప్రసాద్‌ పాల్గొన్నారు.



కామారెడ్డి మండలం గూడెం గ్రామంలో..



లింగంపేటలో..

చెరువులో నిర్మాణాలను అడ్డుకోవాలి



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపేట ఊర చెరువులో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను తొలగించాలని కోరుతు లింగారెడ్డిపేట గ్రామస్తులు శుక్రవారం తహసిల్దార్‌ సుధాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఊర చెరువు కట్ట వద్ద మట్టి పోసి నీరు రాకుండా చేయడంతో పాటు చెరువు చివర ప్రాంతంలో కొంత మంది అక్రమంగా నిర్మాణాలు చేయడం జరిగిందని వారు విన్నవించారు. చెరువుకు సంబంధించి సర్వే నిర్వహించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని వారు కోరారు.

చెక్‌ పవర్‌ రద్దు

దోమకొండ: మండలంలోని ముత్యంపేట గ్రామ ఉప సర్పంచ్‌ ఆకబోయిన శ్రీనివాస్‌కు చెక్‌ పవర్‌ రద్దు చేస్తూ కామారెడ్డి డీఎల్‌పీవో సాయిబాబా ఉత్తర్వులు జారీ చేశారు. నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సర్పంచ్‌తో పాటు ఎంపీవో తిరుపతిరెడ్డికి జాయింట్‌ చెక్‌పవర్‌ ఇచ్చారు.

3న ప్రజావేదిక

నస్రుల్లాబాద్‌: ఉపాధి హామీ పనులకు సంబంధించి 2020 నుంచి 2023 వరకు జరిగిన వివిధ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ కోసం 3న స్థానిక రైతు వేదికలో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుబ్రమణ్యం తెలిపారు.

కార్యకర్తలే పార్టీకి పునాది



మాట్లాడుతున్న ఇంద్రకరణ్‌రెడ్డి

భిక్కనూరు: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ అధికారంలోకి రావడం ఖాయం అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500 గ్యాస్‌ సిలెండర్‌ తదితర వాటి హామీల గురించి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యకర్తలే కాంగ్రెస్‌ పార్టీకి పునాది వంటివారాన్నరు. ఈ సమావేశంలో మండల బీసీ సెల్‌ అధ్యక్షుడు వడ్ల తిర్మల్‌ స్వామి, నాయకులు యాదగౌడ్‌, నారాయణ, మంద బాబు, గొడుగు రాములు, సత్తయ్య, గోపాల్‌రెడ్డి, కుర్మ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

'సాయిచంద్‌'కు నివాళి



సాయిచంద్‌ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దళిత హక్కుల పోరాట సమితి సభ్యులు

బాన్సువాడ : తెలంగాణ ఉద్యమ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్‌ చైర్మన్‌ సాయిచంద్‌ మృతి పట్ల దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అంబేడ్కర్‌ చౌరస్తా వద్ద ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు అయ్యాల సంతోష్‌, నాయకులు మోచీ గణేష్‌ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ మలిదశలో గాయకుడిగా, నాయకుడిగా సాయిచంద్‌ పోరాటాన్ని కొనసాగించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాములు, సాయి, బాలకృష్ణ, అమర్‌, అంజయ్య, చారి, గణేష్‌, కాశీరం, లక్ష్మణ్‌, సురేష్‌, సిద్ధు, దుర్గయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షుడు శివరాంజాదవ్‌

నాగిరెడ్డిపేట: వీవోఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వీవోఏలసంఘం జిల్లా అధ్యక్షుడు శివరాంజాదవ్‌ డిమాండ్‌ చేశారు. నాగిరెడ్డిపేట మండలకేంద్రంలో శుక్రవారం జరిగిన వీవోఏల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. వీవోఏలకు సకాలంలో వేతనాలను చెల్లించాలన్నారు. దీంతోపాటు వీవోఏలపై పనిఒత్తిడిని తగ్గించాలని ఆయన పేర్కొన్నారు. వీవోఏల సమస్యలను పరిష్కరించే దిశగా సంఘం తరపున తాము చర్యలు చేపడతామని ఆయన చెప్పారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌, వీవోఏలసంఘం మండలాధ్యక్షుడు మల్లేశ్‌, నాయకులు వెంకటేశ్‌గౌడ్‌, సాయిబాబ పాల్గొన్నారు.

సంక్షిప్తం

67వ రోజుకు చేరిన నిరసన దీక్షలు

భిక్కనూరు: ఎంఎస్‌ఎన్‌ పరిశ్రమ నుంచి విడుదలయ్యే వ్యర్థాలను అరికట్టాలని కాచాపూర్‌లో చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం నాటికి 67వ రోజుకు చేరుకున్నాయి.

నిరుపేద మహిళకు కుట్టు మిషన్‌ అందజేత

కామారెడ్డి టౌన్‌: మాజీ కౌన్సిలర్‌ మోత్కూరి శ్రీనివాస్‌ పెళ్లి రోజు సందర్భంగా పట్టణానికి చెందిన నిరుపేద మహిళ హెమలతకు శుక్రవారం కుట్టు మిషన్‌ను అందజేశారు.

పర్మనెంట్‌ కాకుండానే పదవీ విరమణ

కామారెడ్డి అర్బన్‌: గ్రంథాలయంలో సురేష్‌ 35 ఏళ్ల సహాయకునిగా పని చేసి పర్మనెంట్‌ కాకుండానే శుక్రవారం పదవీ విరమణ పొందారు. సురేష్‌ దంపతులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ పున్న రాజేశ్వర్‌ సన్మానించారు.

రైతుబంధు డబ్బు కోసం ఆందోళన

సదాశివనగర్‌: రైతుబంధు డబ్బుల కోసం సదాశివనగర్‌, అడ్లూర్‌ ఎల్లారెడ్డి గ్రామాల్లో యూనియన్‌ బ్యాంక్‌, తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌ల వద్ద రైతులు ఆందోళన చేపట్టారు.

ఇసుక వేలం

బిచ్కుంద: అనుమతి లేకుండా నది నుంచి ఇసుక తరలిస్తూ పట్టుబడ్డ ఇసుకను శుక్రవారం రెవెన్యూ అధికారులు వేలం పాట నిర్వహించినట్లు ఆర్‌ఐ సాయిబాబా తెలిపారు.

కల్యాణ మండపానికి భూమి పూజ

సదాశివనగర్‌: అడ్లూర్‌ఎల్లారెడ్డిలో కల్యాణ మండపం నిర్మాణానికి సర్పంచ్‌ పైడి జానకి భూమి పూజ చేశారు. బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్‌ లక్ష్మిపతి, విండో చైర్మన్‌ సదాశివరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

పిట్లం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో లయన్స్‌ క్లబ్‌ పిట్లం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 10 మందికి ఆపరేషన్‌ అవసరమని గుర్తించి బోధన్‌ కంటి ఆస్పత్రికి తరలించినట్లు వైద్యాధికారి హరి కిషన్‌రావు తెలిపారు. లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు రమణ గౌడ్‌, సభ్యులు కిషన్‌, కాశీరెడ్డి పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

పిట్లం: పన్నులు సకాలంలో చెల్లించాలని సర్పంచ్‌ జొన్న విజయరెడ్డి కోరారు. స్థానిక పంచాయతీ కార్యలయంలో శుక్రవారం సర్పంచ్‌ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

రోడ్డు పనులు ప్రారంభం

పిట్లం: మండలంలోని తిమ్మనగర్‌ గ్రామం నుంచి ఖంబాపూర్‌ గ్రామం మీదుగా గోద్మెగాం గ్రామం వరకు తారు రోడ్డు పనులను శుక్రవారం మండల బీఆర్‌ఎస్‌ నాయకులు విజయ్‌ ప్రారంభించారు.

గంగమ్మతల్లికి ప్రత్యేకపూజలు

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు వద్దనున్న గంగమ్మతల్లికి జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి ప్రత్యేకపూజలు నిర్వహించారు. పంటలు బాగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు.

వ్యాయామంతో అంగవైకల్యం దూరం

నిజాంసాగర్‌/పిట్లం: ప్రత్యేక అవసరాల కల్గిన చిన్నారులతో నిరంతరం వ్యాయామాలు చేయిస్తే అంగవైకల్యం దూరం అవుతుందని డాక్టర్లు అరుణ్‌ కుమార్‌, విశాలాక్షి తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం నిజాంసాగర్‌ మండలం మహమ్మద్‌నగర్‌, పిట్లంలో చిన్నారులకు ఫిజియోథెరపీ చేయించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌టీఈ చిన్నసాయిలు, హెచ్‌ఎం రమణ, సీఆర్పీ శంకర్‌గౌడ్‌, టీచర్‌ కమల్‌ కిషోర్‌ తదితరులు పాల్గొన్నారు.